


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *విధాత సాక్షిగా...*

**"పుస్తకం మనిషి జీవితాన్ని** చాలా ప్రభావితం చేస్తుంది" అన్నాడొక మిత్రుడు.

నేను ఆనందంగా "అవును" అన్నాను.

"తన ఇరవయ్యవ ఏట దేవదాసు చదివి, తాగుడికి ఎడిక్ట్ అయ్యాడు మా పెద్దనాన్న" అన్నాడు.

నేను మాట్లాడలేకపోయాను.

"మా పూజారిగారి పెళ్ళాం మైదానం చదివి మస్తాన్ అనే టైలర్‌తో లేచిపోయింది" అన్నాడు.

"అంటే.. పుస్తకాలు చదివి చెడిపోతారనా నీ అభిప్రాయం? రామాయణం చదివి ఏకపత్నీవ్రతం చెయ్యకుండా, రావణాసురుడిలా పక్కింటాడి పెళ్ళాంని లేపుకుపోయే వాళ్ళేనా నీకు తెలిసిన వాళ్ళు?" అని కస్సుమన్నాను.

"ఈడియెట్‌లో రవితేజ పోలీసోడి కూతుళ్ళు ప్రేమించుకోరా? వాళ్ళకి మొగుళ్ళు అక్కర్లేదా?" అంటే, ఇంకా దేశముదురులో అల్లు అర్జున్ "ఈ దేహం మట్టి అంటున్నావు. మట్టే కదే, నేను ముట్టుకుంటే ఏవయిందే? ఏవే? రావే" అంటే క్లాప్స్ కొట్టారు జనం, నీ అందరిబంధువయాలో "కొంచెం పంచవయా.. నువ్వు అందరి బంధువయా" అని చెపితే క్లాప్స్ కొట్టారా? కనీసం క్లాస్ ఐనా నీ సినిమా ఆడించారా? ఏ సినిమా చూసైనా, నవల చదివేయనా మంచి నేర్చుకుంటారా? నాన్‌సెన్స్" అని వెటకారం చేసాడు. నేనూ ఆలోచనలో పడ్డాను.

ప్రతిఘటన మూడుసార్లు చూసిన మా ఇంటిపక్క వాళ్ళ కోడల్ని "అంత బాగా నచ్చిందా ఆ అమ్మాయి కేరెక్టర్?" అని అమాయకంగా నేను అడిగితే "విజయశాంతి కట్టిన చీరలు బావుండి చూసాను. మా ఆయన విజయదశమికి కొనకపోతే సతాయించేస్తాను. అందుకే మూడుసార్లు చూపించాను" అంది.

అప్పట్లో 'మేరా నామ్ జోకర్' చూసిన మగ పిల్లలు టీచర్‌తో ప్రేమలో పడ్డారుట.

"అంటే సాహిత్యం, సినిమా రెండూ సమాజానికి మంచి చెయ్యవు అంటావా?" అని ఎదురు దాడి చేసాను.

అతను చిద్విలాసంగా నవ్వి "రజనీకాంత్ సినిమాలు చూసి సిగరెట్ తాగడం, స్టైలుగా ఎగరేసి నోట్లో పెట్టుకోవడం మొదలుపెట్టాను. ఆయన మానేసాడుట. నేను మానలేకపోతున్నాను నలభై ఏళ్ళుగా" అన్నాడు.

"సాహిత్యంలో మంచి ఉంటుంది. దాన్ని పాలని నీళ్ళ నుంచి వేరు చేసినట్లుగా వేరు చేసి పీల్చుకోవడం నీ తెలివిని బట్టి ఉంటుంది" అన్నాను.

"ఆ మధ్య ఒకడు హాస్పిటల్ కొచ్చి "డాక్టర్ గారూ నాకు నీరసం, నిద్రపట్టడంలేదు, జ్వరం తగ్గట్లేదు, తల తిరుగుతోంది, లేస్తే పడిపోతున్నాను. ఆకలేస్తోంది తింటే అరగట్లేదు" అంటూ ఒక లిస్ట్ చదివాడు.

డాక్టర్ "నువ్వు హెచ్.ఐ.వీ టెస్ట్ చేయించుకో" అనగానే,

ఈడ్చి చెంపమీద కొట్టి, గొంతు బొంగురుగా పెట్టి "నాకు ఎయిడ్స్ అంటావ్రా? ఎంత ధైర్యం?" అన్నాడు.

డాక్టర్ చెంప తడుముకుంటూండగా కాళ్ళు పట్టుకుని "మీరే కాపాడాలి బాబూ! మీరు దేవుడు. మీరే కాపాడాలి" అన్నాడు.

డాక్టర్ తెల్లబోయి చూస్తూండగా అతని పెళ్ళాం "మా ఆయనకి అపరిచితుడు సిండ్రోమ్ డాక్టర్. ఇలాగే ఇద్దరు ముగ్గురు అతనిలోంచి బయటికి వస్తుంటారు. ఇందాక చెప్పిన రోగాలన్నీ ఆయనలో ఉన్న రాబర్ట్వి. రాం వి కావు. రహీం ఇంకా మంచివాడు అంది."

"ఇదేదో జబర్దస్త్ ప్రోగ్రాంలా ఉంది" చిరాగ్గా అన్నాను.

"నీకు తెలీదు, వీక్ మైండ్స్ని ఈ పుస్తకాలూ, సినిమాలూ ఎంతలా ప్రభావితం చేస్తాయో... పాపం హరిశ్చంద్ర సినిమా చూసి గాంధీగారు అప్పట్లో అలా అయిపోయారు" అన్నాడు.

"మహాత్ముడయ్యాడు. ఆయన గురించి జాలిపడ్తావేం" కోపంగా అన్నాను.

"జాలి ఆయన గురించికాదు, ఆయన పెళ్ళాం పిల్లల గురించి. వాళ్ళ అబ్బాయి ఓసారి జాతిపితే కానీ మా నాన్న మంచి పితకాదు అన్నాడుట" అన్నాడు.

"ట్రాష్ నేను నమ్మను" అన్నాను.

"నీకు ఆయన ఇష్టం కాబట్టి నమ్మవు. అదే లాలూ ప్రసాద్ యాదవ్ గురించి అయితే నమ్ముతావు. ఏ జోక్ వేసినా నవ్వుతావు" అన్నాడు.

అతను చెప్పేవన్నీ జీవిత సత్యాలే అంతర్ముఖంగా నేను ఆలోచిస్తున్నాను.

ఈ మధ్య 'కళ్ళుతెరిచిన సీత' అనే రంగనాయకమ్మగారి నవలొకటి చదివాను. 'జానకి విముక్తి', స్వీట్ హోమ్' ఎన్నెన్నిసార్లు చదివానో లెఖ్ఖ లేదు. ఆవిడ రచనలకి నేను ఫ్యాన్ని. ఈ నవల చదువుతున్నట్లు ఫేస్బుక్లో పెట్టగానే, నా శ్రేయోభిలాషులంతా మెసేజెస్, కామెంట్స్ పెట్టారు "ఒద్దు. ఎందుకు చెపుతున్నామో విను. తర్వాత విచారిస్తావు" టైప్లో. నేను వినే టైప్ కాదు 'ఫైర్' సినిమాకి ఫస్ట్డే మా లలితతో వెళ్ళి సినిమా హాల్లో క్యూలో నిలబడితే మగాళ్ళంతా నానా కూతలూ కూసారు. అయినా కేర్ చెయ్యలేదు అప్పట్లోనే.

మొత్తానికి ఆ నవలంతా ఏకబిగిన చదివేసాను. మధ్య మధ్యలో పుస్తకం మూసి సీత మొగుడిలా మా ఆయన ఏమేం చేస్తాడా అని ఆలోచించాను కూడా. సీత మొగుడు నాగరాజు పీటల పెళ్ళే కావాలన్నాడు. మా ఆయన అనలేదు. సీత మొగుడు నాగరాజు పెళ్ళయిన మర్నాడు, సీత నిద్రలేచి వేడి వేడి పూరీలు తింటుంటే "వచ్చి నాతో పెళ్ళి వీడియో చూడు" అన్నాడు. అంతేకాదు తన బర్త్డే రోజు సీత తనని ప్రొద్దుటే "హేపీ బర్త్డే" అని విష్ చెయ్యాలి అనుకున్నాడు. ఇవన్నీకాక సీత అమెరికా వెళ్ళాక వంకాయలు కొనలేదు. ఈవిడ నోరు తెరిచి "వంకాయలు కొనాల్సిందే. నేను ఉల్లికారం పెట్టి కాయలు కాయలు చేసుకుని తింటాను" అనలేదు. అతను వాళ్ళ అక్కకి ఫోన్ చేసి "వంకాయలు కొనాలా? " అని అడిగాడు.

ఆవిడ "ఒద్దురా చాలా కూరలున్నాయి ఇంట్లో" అంది.

ఇలాంటి తప్పులు చేస్తున్నప్పుడు సీత అతన్ని సవరించలేదు. తిట్టలేదు. మౌనంగా ఓపిక పట్టింది.

సీత ఆడబిడ్డ తక్కువది కాదు, ముదురు రంగు దుప్పట్లు కొంది సీత మంచం మీదకి, అంతే కాదు సీతని "పప్పు ఇలా ఎందుకు చేసావు?" అంది. ఇంకా పర్సనల్ విషయాలు కూడా నాతో షేర్ చేసుకోమని అడిగింది.

కస్తూరి పాత్ర కాస్త ఒళ్ళు మండించిన మాట వాస్తవమే. మంచినీళ్ళ జగ్గు కూడా పైన తన గదిలో పెట్టుకోదు. నువ్వే పెట్టాలి అంటుంది. సీత అత్తగారు 'అమ్మో' ఆవిడ పాత్ర చదివితే ఒళ్ళుమండి, అంటుకుపోతుంది.

నాకు మాత్రం నవల సగం చదవగానే, మా ఇంటి గోడల నిండా రకరకాల చార్ట్‌లు తయారు చేసి అతికించాలనే ఐడియా వచ్చింది.

"చెప్పులు లేకుండా బాల్కనీలో నడిచి ఇంట్లోకి రాకండి ఎందుకంటే, మా పిల్లలు, వాళ్ళ ఫ్రెండ్సూ అక్కడ దుమ్ములో నడిచొచ్చినా హాల్ మార్బుల్ ఫ్లోర్ అంతా దుమ్ము దుమ్ము చేస్తారు."

"తడి తువ్వాళ్ళు వెనక వసారాలో దండెం మీద ఆరెయ్యండి" అవి కుర్చీల మీదా, మంచాల మీదా కనిపిస్తే నాకు ఒళ్ళుమంట.

"అందరూ తలో డూప్లికేట్ కీ మెయిన్‌టెయిన్ చేసి, బయటకి వెళ్ళేటప్పుడు తాళం గ్రిల్స్‌కి వేసి కీ జేబులో వేసుకుని పొండి" అని, ఎందుకంటే ఇంట్లో ఉంటే లేచి తలుపు తీసి, వేసీ నడుం పట్టేస్తోంది. ఇలా రకరకాల చార్ట్‌లు రాసి గోడలకి అతికిద్దామా, చెప్పి చెప్పి నోరు పోతోంది అనిపించింది. మంచి ఐడియాలు ఇచ్చినందుకు రంగనాయకమ్మ గారికి థాంక్స్!

మా ఫ్రెండ్ నీలవేణి జుట్టు విరబోసుకుని ఆఫీస్ కొస్తుంది. మనతో మాట్లాడ్తున్నంత సేపూ ఆ జుట్టు నిమిషానికి నాలుగుసార్లు సవరించుకుని, మూడు సార్లు రబ్బర్ బాండ్ వేసి, తర్వాత నాలుగో నిమిషంలో తీసి, ఇంకాసేపు విసుగొచ్చినట్లు కొప్పు చుట్టి, అరక్షణంలో కొప్పువిప్పి మన మొహాన జుట్టు విదిలించి చేస్తుంటుంది. ఎదురుగా ఉన్న డైరెక్టర్, డైలాగ్ రైటర్, నేనూ ఈ ప్రహసనం అంతా ఓపిగ్గా భరిస్తాం. నాకైతే 'విస్కీ' గుర్తొస్తుంటుంది. 'విస్కీ' అంటే మా అన్నయ్య ఇంట్లో కుక్కపిల్ల. కుక్కపిల్లతో పోల్చానని ఏమీ అనుకోకండి. అది ఎందుకో ఆ కుర్చీ మీద నుండి ఇంకో కుర్చీ మీదకి గెంతి బొచ్చు విదులుస్తుంది. మన ఒళ్ళో మొహం రాసి, మళ్ళీ బొచ్చు విదిలిస్తుంది. ఇలా బొచ్చు విదిలించడం దానికి టైం పాస్. కాసేపటికి సోఫాల నిండా, నేలనిండా దాని బొచ్చు రాలి ఉంటుంది.

ఇంతకీ నీలవేణిలాంటి వాళ్ళకి రంగనాయకమ్మ గారింట్లో ప్రవేశం ఎప్పటికీ ఉండదు. ఒక అభిమాని జుట్టు విరబోసుకుని వస్తే ఆవిడ, వాకిట్లోకి వెళ్ళి జుట్టు దువ్వుకుని జడవేసుకుని వస్తేనే ఇంట్లోకి రమ్మన్నారట.

మరీ అంత మొహమాటం లేకుండా (అమర్యాదగా) మనం అనలేము అనుకోండి. కానీ ఈ హీరోయిన్లూ, వారిని అనుకరించే అమ్మాయిలు ఈ జుట్టు (బొచ్చు, విస్కీలాగా) విదిలించడం కొంచెం చిరాగ్గానే ఉంటుంది. మొత్తం పుస్తకంలో గాంధీగారి మీద నాకు అపారమైన జాలి కలిగింది. ఆయన్ని ఈవిడ 'ఉత్తుత్తి లాయర్' అనీ, 'ఇడ్లెన్లు మందంగా' చేస్తాడనీ, ఎక్కువగా మాట్లాడ్తాడనీ హేళన చేస్తుంది. సరసమేలెండి. కానీ ఆయన ప్రొద్దుట ఆరుగంటలకి ఈవిడకి థైరాయిడ్ టాబ్లెట్లూ, మంచినీళ్ళూ అందించి, అప్పటినుండీ, గిన్నెలు తోముటా, ఇడ్లెన్లు వేయుటా, మెయిల్స్ చెక్ చెయ్యుటా, మనవరాలిని స్కూల్ బస్ ఎక్కించుటా, కూరగాయలు తెచ్చుటా, తర్వాత ఆఫీసుకి వెళ్ళుటా ఇత్యాది పనులు ఓ'మర'లా చేస్తూనే ఉంటాడు. ఈవిడ తన గది ఊడ్చుకోవడం, కాఫీ గ్లాసులు కడగడం, అదీ గృహ కార్మికురాలు రాకపోతే (నేనూ మా వరాలుని అలాగే పిలుస్తానని సరదా పడితే అది ఒద్దంది). రాసుకోవడం, శ్యామలతో మాట్లాడడంలాంటి పనులు చేస్తారు పాపం. ఇంక నళిని, రుచిగా రెండుపూటలా వండిపెట్టి ఆఫీసుకి వెళ్ళి ఉద్యోగం చేసొచ్చి స్టార్టకన్ అనే బాబునీ, పాపనీ కూడా చూసుకునే కోడలు (బంధుత్వాలు ఆవిడకి పడవు అనుకోండి) అయినా నళిని మీద 'గిన్నెలు కడిగి వంట చేస్తే ఇంకా రుచిగా ఉండేవనేలాంటి సెటైర్లు (అత్తగారేగా ఎంతైనా) ఈవిడ వేస్తూ ఉంటారు.

నాకు మొత్తం పుస్తకంలో నచ్చిన విషయాల్లో సీతని శ్యామల రెస్క్యూ చేసి ఆడబిడ్డనుండీ, మొగుడినుండీ తప్పించి అమెరికాలో తన ఇంటికి తెచ్చుకున్నాకా, సీత వెళ్ళి మేడమీదున్న బెడ్‌రూంలో పడుకుంటుంది.

అప్పుడు రంగనాయకమ్మగారు ఈ విషయం విని శ్యామలతో అంటారు "అదేవిటీ, నువ్వంత సాయం చేసి అంతటి నరకం నుండి తప్పించి తెచ్చాకా, నీ చంటి పిల్లాడితో తనకి నిద్ర సరిగ్గా ఉండదని, నిన్ను వదిలేసి పైకి పోయి పడుకుందా? చక్కగా నీతో కబుర్లు చెప్పుకుంటూ నీ పక్కనే పడుకోవద్దూ?" అని. ఆ మాట నాకు ఎంతో నచ్చింది ఎంతో సున్నిత హృదయులూ, స్నేహ మనస్కులూ మాత్రమే అలా ఆలోచించగలరు. నా ఇంటికి నా స్నేహితురాళ్ళు వస్తే నా మంచం మీదే పడుకోమని, నేనూ వాళ్ళూ అర్థరాత్రి దాకా కబుర్లు చెప్పుకుంటాం. ప్రపంచం అంతా రణగొణ ధ్వనులూ, ఉరుకులూ పరుగులూ మానేసి నిశ్శబ్దంగా నిద్రపోతున్న ఆ వేళలో మనం మాత్రం మనకి ఇష్టమైన వాళ్ళకోసం మేల్కొని ఆ కబుర్లు చెప్పుకోవడంలో మజానే వేరు.

మా చిన్నతనంలో ఆర్.టీ.సీ కాలనీలో ఉన్నప్పుడు, మా బాబు మావయ్య చిక్కడపల్లి నుండి తన లీల అనే సైకిల్ మీద మా ఇంటికొచ్చేవాడు. ఊర్నుండి మా పెద్దమ్మా, పెద్దనాన్నా వస్తే, వరండాలో కూర్చుని అర్థరాత్రి దాకా 'పయనించే మన వలపులు బంగరు నావా..' అనో 'నీలి మేఘాలలో' అనో పాటలు పాడుకుంటూ కూర్చుంటే అందరం, ఘూర్కా రెండో జాములో వచ్చి కాసేపు కూర్చుని విని ఆనందించి వెళ్ళేవాడు. అవెంత మధురమైన రోజులు. తెల్లవారి అందరికీ ఉద్యోగాలున్నా, ఎంతో నిదానం ఉండేది జీవనంలో. అమ్మమ్మ బాయిలర్ అంటించడానికి అరగంటపైన పట్టేది. నిదానంగా కుంపటి అంటించేది. ఫాస్ట్‌గా అది అంటుకోదుగా. ఎవరు కుంపటి తొందరగా వెలిగించి కాఫీ పెడ్తారని మా అక్క చెల్లెళ్ళకి, మా అన్నయ్యకి పందెం పెట్టేవాడు. ఇల్లు ఊడవడం, గోవింద నామాలు పాడుతూ కూర తరగడం, మజ్జిగ చెయ్యడం, బియ్యం ఎసరు పెట్టి అది ఉడికేదాకా, మధ్యాహ్నానికి తిరగలితో రవ్వ విసురుకోవడం, ఇవన్నీ నిదానంగా జరిగేవి. ఉరుకులూ పరుగులుతో అన్నం నోట కొట్టుకుని, నీళ్ళు ఒంటికి బండ మీద పోసుకున్నట్లు పోసుకుని పరుగులు పెడితే అమ్మమ్మ ఊరుకునేది కాదు. అన్నీ తెల్లవారు ఝామునే లేచి నెమ్మదిగా, శుచిగా శుభ్రంగా చెయ్యాలి ఇవన్నీ నాకు రంగనాయకమ్మగారి నవల చదువుతుంటే గుర్తొచ్చాయి. నాకుబాగా నచ్చిన మరో అంశం తిండి.

ఆవిడ పుస్తకంలో స్వల్పంగా ప్రస్తావించినా సీత చేసిన లాంటి 'మసాలా వడలు' తినాలనిపించింది. అలాగే 'చింతచిగురు పప్పు, గోంగూర పచ్చడి' ఏది రాసినా నోట్లో నీళ్ళూరాయి. ఏ పేజీకూడా మనకి పెద్దగా ఏకాభిప్రాయం లేకపోయినా, వదిలిపెట్టాలని కానీ, తిప్పెయ్యాలని కానీ అనిపించలేదు. అలా రాయగలగడమే మంచి 'శైలి' అంటారని నేను చాలాసార్లు, చాలా చోట్ల ఉదాహరణలతో సహా చెప్పి చెప్పి విసుగు చెందాను.

ఇంతకీ చివరాఖరిగా నేను చెప్పేదేవిటంటే, మా మిత్రుడు పుస్తకాల వల్ల జరిగే చెడుని గ్రహించే వాళ్ళనే చూసాడు. చూసారా. నేను అన్నీ మంచి విషయాలే చెప్పాను. అంటే మనం చూడాలనుకున్నదే మనం చూడగలగాలి అర్జునుడి 'గురి'లా.

నిజానికి ఆవిడ సీతనీ, ఆమె నాన్ననీ, శ్యామలనీ తిట్టిన తిట్లు అన్నీ మామూలుగా అందరూ చేసే పనులు వాళ్ళు చేసినందుకే.

సీత నాన్న కమ్యూనిస్టు అయికూడా అల్లుడి కాళ్ళు కడిగాడు. సీత 'జానకి విముక్తి' చదివి కూడా తలంబ్రాల పెళ్ళికి ఒప్పుకుంది. మెడలో అత్తగారు ముచ్చట పడిందని మంగళ సూత్రం ఉంచుకుంది. అన్నీ ఇలాంటి విషయాలే. ఆవిడ కంటికీ మనసుకీ అవి తప్పు. ఆ భావజాలం మనకి నచ్చకపోయినా ఈ పుస్తకం చాలా బావుంటుంది చదవమనడానికి. చిన్నప్పుడు మా అమ్మ తలుపు వెనకాల "చెంబు లోపల పెట్టు", "గెడ వేసి తాళం వెయ్యి" అని రాసిపెట్టింది. నేను పెరట్లో చెంబు మరిచిపోతాననీ, తాళం వేసి గడియ మరిచిపోతాననీ. ఇంటికొచ్చిన ప్రతివాళ్ళూ చదివి నవ్వుతుంటే నాకు చిన్నతనంగా ఉండేది. ఆ సంగతి గుర్తొచ్చింది ఈ 'కళ్ళు తెరిచిన సీత' చదువుతుంటే.

ఇంక ఈ మధ్య నేను చదివి అతిగా ప్రభావితం అయి నా జీవనశైలినే మార్చేసుకున్న పుస్తకం 'విధాత' మల్లాది వెంకటకృష్ణమూర్తిగారు నాకు రచయితగా చిన్నప్పటి నుండీ తెలుసు. కానీ వ్యక్తిగతంగా ఓ పది సంవత్సరాలనుండీ తెలుసు. ఆయన శ్రీమతి పద్మజ నాకు మంచి మిత్రురాలయింది. మా అభిప్రాయాలు బాగా దగ్గరగా ఉంటాయి. కాంతికిరణ్ పాతూరిగారూ, పద్మజా, నేనూ, లలిత చిట్టే మంచి స్నేహితులం అని ధైర్యంగా చెప్పుకోగలం.

'విధాత' చదివాక, పుస్తకం మూసి 'నేను నాకూ, నా కుటుంబానికీ కాకుండా ఇంకొక్కరికైనా నిజంగా ఉపయోగపడుతున్నానా? అని ఆలోచించాను. నా డ్రైవర్ గుర్తొచ్చాడు. ఎప్పుడైనా 'నేను చస్తానురా' అని సరదాగా అన్నా 'ఒద్దమ్మా మీ వల్లే నా కుటుంబం బతుకుతోంది' అంటాడు కుమార్. (అసలు పేరు కొమరెల్లి) అతను సర్వీస్ చేస్తున్నాడు కనుక జీతం ఇస్తున్నాను. అలాకాక ఇంకెవరికైనా ఉపయోగపడుతున్నానా? అని ఆలోచించా. 'హోమ్‌లో' ఉన్న ప్రసూనాంబగారు గుర్తొచ్చారు. ఆవిడ "'నారాయణరావు' పుస్తకం ఉందా? చదవాలని ఉంది" అనడం గుర్తొచ్చింది. వెంటనే విశాలాంధ్రకి వెళ్ళి కొని ఆవిడకి పంపించాను. ఇంకా ఎన్నో మార్గాలున్నాయి ఇతరులకి ఉపయోగపడ్డానికి అని పుస్తకం చదువుతున్న కొద్దీ అనిపించి ఒక లిస్ట్ రాసుకున్నాను. అవన్నీ చెయ్యాలంటే ప్రస్తుతం ఉన్న డబ్బు సరిపోదు. నేను ఒక డెయిలీ సీరియల్ నా కోసం చేస్తే, ఇంకోటి ఇతరుల కోసం చెయ్యాలి. రెండో సీరియల్ కూడా చెయ్యాలి.

ఇలా ఆలోచించి మల్లాదిగారికి ఫోన్ చేసాను. నా అభిప్రాయాలు అన్నీ విని ఆయన "మీరు చేస్తున్నానూ, చెయ్యాలీ అనుకోకుండానే నేచురల్‌గా చాలా చేసేస్తారు" అన్నారు. ఎంతో ఆనందంగా అనిపించింది. ఫరవాలేదు మనం మనుషులలా పరిగణించపడచ్చు అనిపించింది. ఆయన మాట్లాడుతున్నప్పుడే "మీరు ఫలానా అమ్మాయికి హెల్త్ చెకప్ చేయించారు. అలాంటి ఆలోచన నాకు రానేరాదు. అవే సేవలు అంటే" అన్నారు.

వీరేంద్రనాథ్ గారు నేనూ లిల్లీ (లలిత చిట్టె) ఆయనని కలవడానికి వెళ్ళినప్పుడు "రిలేషన్స్ మెయిన్‌టెయిన్ చెయ్యడం రమణికి బాగా తెలుసు" అన్నారు. నేను పొంగిపోతూ ఆ మాట మల్లాదిగారి ఇంటికి మేం భోజనానికి వెళ్ళినప్పుడు చెప్పాను. దానికి మల్లాదిగారు "మీరు మెయిన్‌టెయిన్ చెయ్యాలనుకుని చెయ్యరు" అన్నారు. ఆ మాట ఆలోచించిన కొద్దీ నాకు నిజం అనిపించింది. ఈ మనిషితో నేను స్నేహం చేస్తే, పరిచయం పెంచుకుంటే నాకు ఏం అవసరం? ఏం ఉపయోగం అని నేను ఒక్కరోజూ ఆలోచించలేదు. ఏ మనిషైనా నాకు నచ్చుతారు. వాళ్ళల్లో స్నేహం అందుకునే గుణం ఉంటే నాతో కంటిన్యూ అవుతారు. ఓ పెద్ద కార్యక్రమంలో మూడువేలమందిలో నన్ను మాత్రమే పరిచయం చేసుకున్న తర్వాత ఆత్మీయులుగా మారిన ఓ డాక్టర్‌ని "విచిత్రం కదా, మనం మాట్లాడుకోడానికి కామన్ టాపిక్ లేదు. మీరు పుస్తకాలు చదవరూ, సినిమాలు చూడరు. నాకు మెడికల్ విషయాలు తెలీవూ. ఎలా ఫ్రెండ్స్ అయ్యాం?" అని నేను అడిగితే "ఈమె మంచి స్నేహితురాలు అవుతుందని నాకు చూడగానే అనిపించింది" అన్నాడు.

ఈ విషయం మాట్లాడే ముందే మల్లాదిగారి 'కర్మ జన్మ' గురించి కూడా మాట్లాడాలి. ఒకరోజు మా డాక్టర్ నాయక్ గారి దగ్గరకి అపోలో (హైదర్‌గూడా) వెళ్ళాను. ఆయన నాకు ఇరవైఏళ్ళుగా నా పాఠకుడిగా, స్నేహితుడిగా ప్రస్తానం. ఆయన టేబుల్ మీద ఈ కర్మ - జన్మ పుస్తకం కనిపించింది. ఎవరో పేషెంట్ వచ్చి "ఆపరేషన్ అయిందిగా డాక్టర్. మా అమ్మగారి పరిస్థితి ఏవిటి?" అని అడిగితే ఆయన "కర్మ - జన్మ' చదవలేదా? అది చదువు. మనం చేసేది చేసాం. జరగాల్సింది జరుగుతుంది" అనడం విన్నాను. తరువాత పడీపడీ నవ్వాను. "మల్లాదిగారు మీకు బాగా పనికొచ్చారు డాక్టరుగారూ" అని.

కిరణ్‌ప్రభగారు మొన్న శనివారం రోజు కౌముది పాఠకులకు ఆడియో వీక్లీలో 'విధాత' నవల పరిచయం చేసారు. అది ఆధ్యాత్మిక గ్రంథం. ఒక కమర్షియల్ రైటర్ దేనినైనా ఫిక్షన్‌లా మార్చగలరు అని నిరూపించారు మల్లాది గారు. కిరణ్‌ప్రభగారు ఎంత కాంప్లికేటెడ్ పుస్తకమైనా సులువుగా చెప్పగలరు.

ఒక త్రిలోచని అనే ఆవిడ జీవితం. ఆవిడ జీవితంలో చాలా కష్టాలొచ్చాయ్. బాగా డబ్బున్నవాళ్ళకి వచ్చే కష్టాలు. వ్యాపారంలో నష్టం, మొగుడితో విడాకుల కేసు, పెద్దల్లుడికి లివర్ ట్రాన్స్‌ప్లెంటేషన్, చిన్నకూతురు ఈవిడకి ఇష్టం లేని అబ్బాయిని ప్రేమించటం, వియ్యంకుడు ఈవిడిని గౌరవించక పోవటం, ఫ్లాట్స్‌లో ప్రెసిడెంట్ ఈవిడితో గొడవపడటం, ఫ్లాట్స్‌లో వాచ్‌మెన్ ఈవిడిని గౌరవించకపోవటం, ఇన్‌కం టాక్స్ వల్ల ఫ్యాక్టరీ లాకౌట్ అయ్యే పరిస్థితి రావటం, ఇలా అనేకానేక సమస్యలు వీటికి పరిష్కారం లేదనుకుంది ఆవిడ. అయితే అనుకోకుండా వయసులో ఉన్నప్పుడు ప్రేమించిన ప్రియుడు వచ్చాడు. మనవలు కూడా పుట్టిన ఈవిడిని

ఇప్పుడు పెళ్ళి చేసుకుంటాను, మీ ఆర్థిక సమస్యలు తీరుస్తాను, తనతో విదేశాలకు రమ్మని ఒక ఆఫర్ ఇచ్చాడు. ఈ పరిస్థితుల్లో ఉన్న ఆవిడకి ఒక ముసలి వ్యక్తి తారసపడ్డాడు. అతనే విధాత. జీవితంలో మునుపెన్నడూ చూడని, తెరవని కొత్త తలుపు తెరిచాడు. నువ్వు నీకు కాకుండా జీవితంలో ఇంకెవరికైనా ఉపయోగపడ్డావా! అనే కొత్త ప్రశ్న ఆవిడలో ఉదయించేట్లు చేశాడు. ఏదైనా సంఘటన దేనికైనా ప్రేరణ కావచ్చు.

నేను హృదయకాలేయం సినిమా చూసొచ్చిన తరువాత సంపూర్ణేష్ బాబు గురించి డాక్టర్. మోహన్‌వంశీకి చెపుతున్నప్పుడు 'అబ్బా అతన్ని ఎలా చూస్తాం చెప్పు' అన్నాడు.

'అదికాదు అతని కాన్ఫిడెన్స్‌ని చూడండి ఒక సోషల్ మీడియా ద్వారా ఒక సామాన్యుణ్ణి ఒక హీరోగా జనం మధ్యలోకి తీసుకువచ్చి అతనికి ఒక గుర్తింపు, క్రేజ్ ఉందని నమ్మించి రాష్ట్ర సంపూ యువసేన అనేది అతికొద్దికాలంలో బాగా పాపులర్ చేసి జనం మీదకి ఒదిలిన ఆ డైరెక్టర్ సాయి రాజేష్ ప్రతిభని మనం గుర్తించాలి' అని చెప్పాను.

ఎవరేం తిట్టినా నీ పర్సనాలిటీ నీ మొహం అద్దంలో చూసుకున్నావా అని అన్నా కూడా సదా నీ ప్రేమకి బానిసని అనేవాడు సంపూ. ఇదంతా రిహార్సిల్స్ ద్వారా వచ్చిన కాన్ఫిడెన్సే, ఇంకొక మాటకూడా చెప్పేవాడు. 'యు కెన్ లవ్ మి, ఆర్ హేట్ మి, బట్ యు కెనాట్ ఇగ్నోర్ మి.'

ఆ రకంగా యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుని జనసేన స్థాపించిన పవన్ కళ్యాణ్ కన్నా, అతని పవనిజం కన్నా, రాష్ట్ర సంపూ యువసేన అనేది ఎక్కువ పాపులర్ చేసిన సాయిరాజేష్ గొప్పవాడు. నాకతన్ని చూస్తే ఎప్పుడో చదివిన ఒక న్యూస్ ఐటం 'కొండను తవ్వి రోడ్డు వేసిన వృద్ధుడు' గురించి జ్ఞాపకం వచ్చింది. అంత పట్టుదలగానూ తను అనుకున్న విషయాన్ని నమ్మాడు. నమ్మిన విషయాన్ని తీశాడు. అని డాక్టర్‌కి వివరించాను. అయితే ఆ రాత్రి రౌండ్స్ అయ్యాక డాక్టర్ ఎన్‌టివీలో సంపూ ఇంటర్వ్యూ చూశాడు. యాంకరమ్మాయి అతనిని హేళన చేసినట్టుగా మాట్లాడిందట. అయినా సంపూ చిరునవ్వుతో నిలకడగా మాట్లాడుతున్నాడట. ఎక్కువసేపు చూడ్లేదు. కానీ డాక్టర్‌లో ఉన్న కాన్ఫిడెన్స్ మరింత పెరిగిందట. మరునాడు సాయంత్రం నాకు ఫోన్ చేశారు. కర్నూల్లో ఒమేగా కొత్త ప్లాంట్ తెరుస్తున్నాము నువ్వు చెప్పిన మాటలవల్ల నైతేనేమి, సంపూ లో ఆత్మవిశ్వాసం చూసిన తరువాత నేను వెంటనే నా ఆత్మ విశ్వాసాన్ని ఇంకాస్త పెంచుకుని ఆ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసాను అని చెప్పారు. ఎన్నో వేల మంది రోగులకి అత్యవసరమైన కాన్సర్ చికిత్సా కేంద్రం ఈ సంఘటన వల్ల ప్రారంభం అవగలదని ఎవరైనా ఊహించగలరా!

టోరీలో కిరణ్‌ప్రభగారి ప్రోగ్రాం విన్న తరువాత ఆయనకి నేను ఫోన్ చేసాను. అప్పుడు మేమిద్దరం చర్చించుకుంటుండగా 'సమయాభావం వల్ల మీరు ఒక పాయింట్ వదిలేశారు' అన్నాను.

అదేమిటంటే స్టాలిన్ సినిమాలో హీరో ఎవరికైనా సాయం చేస్తే తిరిగి తనకి సాయం చెయ్యక్కరలేదు. ఇంకో ముగ్గురికి చెయ్యమంటాడు. అలాగే విధాతలో మీకు మా ఆర్థిక సాయం కావాలంటే మమ్మల్ని సంప్రదించండి అని ప్రకటన ఇచ్చిన ఇద్దరు సంపన్నులు 'కానీ ఇతరులకుపయోగపడే రెండు మార్గాలయినా కనీసం మీరు చెప్పాలి' అనే నిబంధన పెడతారు. దీని వల్ల మల్లాదిగారు మనకి మనం సమాజానికి ఎన్ని రకాలుగా ఉపయోగపడచ్చో నేర్పించారు. అందరూ కొత్త కొత్త ఐడియాలతో ముందుకొస్తారు. అందరూ కనక అవి ఆచరిస్తే ప్రపంచమొక అద్భుత సుందరనందనవనమైపోతుంది అని ఆ విషయాలగురించి మేమిద్దరం మాట్లాడుకున్నాం. మనిషిలో మానవత్వం పరిమళించి దానికి కొంత ఆధ్యాత్మికత అనే సువాసన కూడా అబ్బితే అది ఒక ఫిక్షన్ నవలగాకూడా రాయొచ్చని మల్లాదిగారు ప్రూవ్ చేసారు. 'దీనికి నేను స్క్రీన్‌ప్లే చెయ్యగలనా? ' అని కిరణ్‌ప్రభగారిని అడిగాను. లిప్తపాటు కూడా ఆలోచించకుండా 'బ్రహ్మాండంగా చెయ్యగలరు' అన్నారు.

అప్పట్నుంచీ నేను కమర్షియల్‌గా ఈ సినిమాని ఎలా తీయచ్చా అని ఆలోచనలో పడ్డాను. ఇప్పుడు మళ్ళీ విధాత కథ ఎక్కడ ఆపామో అక్కడికొస్తే గనక త్రిలోచనలో తెరుచుకున్న జ్ఞానద్వారం వల్ల ఆమె జీవితానికి కొత్త బాట కనిపించింది. అన్ని సమస్యలూ వాటంతటవే పరిష్కారమయ్యాయి. ఫ్లైట్ లో అయిన ఓ చిన్న పరిచయం వల్ల అల్లుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అయ్యింది. మాజీ రాష్ట్రపతి చనిపోవడం వల్ల, కోర్టుకి సెలవు రావడం వల్ల, ఇన్ కంటాక్స్ వాళ్ళు ఇల్లు వేలం వేయడం వాయిదాపడి ఈలోగా భర్తతో రాజీపడి జీవితం ఒక ఒక గాడిన పడింది.  ఈవిడకి ఇష్టం లేని పెళ్ళి చేసుకుంటానన్న కూతురు తండ్రి వల్ల తిరిగొచ్చింది. అప్పటివరకు గౌరవించని వియ్యంకుడు గౌరవించడం ప్రారంభించాడు. ప్లాట్స్‌లో ప్రెసిడెంట్ కూడా దారికొచ్చాడు. వాచ్‌మెన్‌తో సహా అందరూ శ్రద్ధ చూపించారు. అన్ని సమస్యలు మబ్బు విడినట్లు పరిష్కారమయ్యాయి. విధాత తలచుకుంటే పరిష్కారం కానిదేముంటుంది. రాసే వాడు, మెలికలుపెట్టేవాడు, కథకి ముగింపునిచ్చేవాడు విధాతే కదా! దేవుడ్ని నమ్మినా నమ్మకపోయినా అందరూ ఇష్టపడే నవల ఇది. ఈ దేవుడు అనే థీరీని నమ్మని కిరణ్‌ప్రభగారే అందుకు ఉదాహరణ.

అప్పుడే పెళ్ళయి, జీవితం ప్రారంభిస్తున్న వేళ మల్లాదిగారి 'అందమైన జీవితం' చదివి, జీవితం ఎంత ఆనందదాయకంగా చిన్న చిన్న పనుల ద్వారా మలుచుకోవచ్చో నేర్చుకున్నాను.

జీవితం రెండో సగం ప్రారంభం అయ్యేవేళ 'విధాత' చదివి 'నీ జీవితం నీ ఒక్క ప్రాణానికి మాత్రమే సంబంధించినదికాదు' అని తెలుసుకున్నాను.

థాంక్స్ మల్లాదిగారూ.

మా భువనచంద్రగారు ఎప్పుడూ చెప్తుంటారు నాతో "బాలాజీ చూడగానే మిమ్మల్నీ, అమ్మనీ, హమ్మయ్యా నా వాళ్ళు నాకు దొరికేసారు అనిపించేసింది. ఎందుకో తెలుసా? ఈ పరిచయం, ఈ సంబంధం. ఈ జీవితానిదికాదు, వెనక జన్మది" అని.

అవునుకదా! ప్రాప్తం ఉన్న తీరానికే పడవ చేరుకుంటుంది. ఇన్ని కోట్ల మందిలో కొంతమందితోనే మనం ఎందుకు కలిసిపోతాం?

ఇదంతా పుస్తకం చదివి ప్రభావితం అయి పాడవనక్కర్లేదు. బాగుపడి పదిమందికీ ఉపయోగపడచ్చు అని నా మిత్రుడికి చెప్పడానికే.

Post your comments

